క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



జైపూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

భీమారం: జైపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాదిగహక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు జనంపల్లి బానేష్, వెంకట్రాం పల్లి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి తిరుమల, వాసు, వార్డు సభ్యులు జాడి రవి, నాయకులు కుమ్మరి రాజ్‌కుమార్, ఆరెపల్లి సిద్దులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్ ఉన్నారు.

నేటి ధర్నాకు తరలిరండి

జన్నారం: బీజేపీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 5న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు మండల బీజేపీ కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు కోరారు. రైతులకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఒత్తిడి పెంచే క్రమంలో బీజేపీ చేపడుతున్న ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'వంశీకృష్ణను గెలిపించాలి'

దండేపల్లి: పెద్దపల్లి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని వంశీ యువసేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దమ్మ సునీల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వంశీకృష్ణ గెలుపునకు వంశీ యువసేన నాయకులు కృషి చేయాలన్నారు.

'తప్పుడు ప్రచారం తగదు'

తాండూర్: కుటిల రాజకీయాలు చేస్తూ నీచ సంస్కృతికి తెరలేపితే చట్టపరమైన చర్యలు తప్పవని తాండూర్ ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, వైస్ ఎంపీపీ దాగం నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి పై నిరాధార ఆరోపణలు చేస్తూ ఆయనను అప్రతిష్ట పాలు చేయాలని కొందరు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఐకేపీ ఏపీఎం శ్యామల, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. యాసంగి పంటకు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ధాన్యంలో అధిక తేమశాతం లేకుండా చూసుకుని మంచి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దీప్తి, ఐకేపీ సీసీలు సుందరేశ్, రామకృష్ణ, ప్రసాద్, అంజలి, గ్రామ సంఘం అధ్యక్షురాలు స్వప్న, వీవో అధ్యక్షురాలు విజయలక్ష్మి, వీవోఏలు వెంకటస్వామి, శ్రీవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో 1985–86లో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారి స్నేహితుడి కూతురు వివాహానికి రూ.14వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. చిన్ననాటి స్నేహితుడైన నాగమల్ల శ్రీనివాస్ గతంలోనే మృతి చెందగా, ఆయన కూతురు నాగరాణి వివాహానికి స్నేహితులు కొంత నగదును జమ చేసి, వివాహ సమయంలో ఆమెకు అందించారు. కార్యక్రమంలో స్నేహితులు బొలిశెట్టి కిషన్, బొలిశెట్టి రాజన్న, రాయిలి మల్లేశ్, కల్లు రాజలింగు, రామగిరి శంకర్, కముటం హరికృష్ణ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన ఇద్దరు నిరుపేద యువతుల వివాహ ఖర్చుల కోసం రామకృష్ణాపూర్ యువత సభ్యులు గురువారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఆవునూరి శంకరమ్మ–బ్రహ్మయ్యల కుమార్తె వివాహం కోసం రూ.10వేలు, శంకరమ్మ–సురేష్‌ల కుమార్తె వివాహం నిమిత్తం రూ.5500లతో పాటు 25కేజీల బియ్యాన్ని అందించారు.

ఐటీఐ.. తాగునీరు నై!

- మూలనపడ్డ వాటర్ కూలర్(ఫ్రిడ్జ్)
- దాహంతో అల్లాడుతున్న విద్యార్థులు
- చందాలు వేసుకుని వాటర్ క్యాన్లు కొనుగోలు
- ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని వేడుకోలు

మంచిర్యాల ఐటీఐ విద్యార్థులు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. రోజుకొకరి చొప్పున వాటర్ క్యాన్ కొనుగోలు చేసి తాగుతున్నారు. వాటర్ క్యాన్ రాని రోజు, ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిళ్లతో దప్పిక తీర్చుకుంటున్నారు. ఎండలు మండిపోతున్న ఈ తరుణంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై కథనం.


- మంచిర్యాలఅర్బన్



మంచిర్యాల ఐటీఐలో విద్యార్థులు

గోడు చెప్పేదెవరికి..?

మంచిర్యాల ఐటీఐలో 380మంది విద్యార్థులు చదువుతున్నారు. దూర ప్రాంతాల నుంచి చదువుల నిమిత్తం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాటర్‌కూలర్(ఫ్రిడ్జ్) చెడిపోయింది. సమయపాలన లేని మున్సిపల్ కుళాయి వస్తే ఓవర్‌హెడ్ ట్యాంకులోకి ఎక్కిస్తారు. చేతులు కడుక్కోవటం.. టాయిలెట్స్‌కు వినియోగించటానికి సరిపోతుంది. తాగునీటి అవసరాలకు మాత్రం వాటర్ క్యాన్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇటీవల నీరు చల్లగా ఉండేందుకు రంజన్ ఏర్పాటు చేసుకోగా, చిల్లుపడి నీరు కారుతుండటంతో ఇంటి నుంచి వాటర్‌బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తే తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. మున్సిపల్ నీరు రెగ్యులర్‌గా వస్తే సమస్య కొంత మేర పరిష్కారమయ్యే వీలుంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నిరుపయోగంగా దాత ఇచ్చిన వాటర్‌కూలర్(ఫ్రిడ్జ్)

వాటర్ కొంటున్నాం..

మా క్లాస్‌లో 29మంది విద్యార్థులు ఉన్నాం. దాహార్తి తీర్చుకునేందుకు వాటర్‌క్యాన్‌లు కొనుగోలు చేస్తున్నాం. రోజుకో విద్యార్థి రూ.30 నీటి కోసం ఖర్చు చేస్తున్నాం. అవి కూడా సరిపోని పరిస్థితి. వెంట తెచ్చుకున్న వాటర్‌బాటిళ్లతో గొంతు తడుపుకుంటున్నాం. లేదంటే ఏదో హోటల్‌కు వెళ్లటమో..? బాటిల్, వాటర్‌ప్యాకెట్ కొనడమో..? చేస్తున్నాం.

- నరేందర్, విద్యార్థి

ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం

చల్లటి నీరు కోసం వాటర్‌క్యాన్ తెప్పించి రంజన్‌లో పోసేవాళ్లం. ఇప్పుడు అది కూడా కారుతుంది. ఇప్పుడు ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. పొద్దంతా నీరు సరిపోకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. శుద్ధమైన నీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. లేదా మున్సిపల్ నీటిసరఫరా రోజంతా వస్తే బాగుంటుంది.

- సాత్విక, విద్యార్థి

ఆర్వో ప్లాంట్ లేక ఇబ్బందులు



శుద్ధమైన నీటి కోసం ఆర్వో ప్లాంట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ నుంచి నీటిసరఫరా జరుగుతున్నా.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో విద్యార్థులు నీరు పట్టుకోలేకపోతున్నారు. ఉద్యోగులందరూ కలిసి వాటర్ క్యాన్‌లు తెప్పించినా, ఇటీవల ఆకతాయిలు ఆ మున్సిపల్ కుళాయి కనెక్షన్ పైపులైన్‌ను చోరీ చేశారు. బోర్‌వెల్‌కు విద్యుత్ సరఫరా చేసే కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. టాయిలెట్ నీటి సరఫరా నిలిచిపోవటంతో ఐటీఐ ఉద్యోగులను కలిసి వైరు కొనుగోలు చేసినా, టాయిలెట్ డోర్లు కాల్చటం.. కుళాయిలు విరగొట్టడం తరుచూ జరుగుతుంది. నూతనంగా అమర్చిన ఏసీల కాపర్ వైరు దొంగిలించారు. దీంతో శ్రీరాంపూర్ ఐటీఐ నుంచి డిప్యూటేషన్‌పై వాచ్‌మెన్‌ను నియమించగా విధి నిర్వహణలో ఉన్న అతడిని కూడా, గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి గాయపర్చారు. ప్రహరీ నిర్మాణం లేకపోవటంతో ఐటీఐ ఆస్తులకు రక్షణ లేకుండాపోతుంది. ఐటీఐకి పూర్తిస్థాయి వాచ్‌మెన్ నియమించాల్సి ఉంది.

- చందర్, ఐటీఐ, ప్రిన్సిపాల్

రెండేళ్లయినా పరిహారం రాలే..!

- పులి దాడిలో పశువు మృతి
- బాధిత రైతు అటవీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పరిహారం అందించాలని వేడుకోలు



పులి దాడిలో మృతిచెందిన ఎద్దు కళేబరం(ఫైల్)

కోటపల్లి: పులి వల్ల నష్టం జరిగితే పరిహారం చెల్లిస్తాం.. బాధితులను ఆదుకుంటాం.. పులికి ఎలాంటి హాని తలపెట్టొద్దు.. అని అటవీ అధికారులు కోటపల్లి మండలంలో పులి సంచరిస్తున్న సమయంలో గ్రామగ్రామానా చెప్పిన మాటలివి. కానీ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. పులిదాడిలో ఓ రైతు తన ఎద్దును కోల్పోయి 2 సంవత్సరాలు కావస్తున్నా, బాధిత రైతుకు పైసా కూడా పరిహారం ఇవ్వలేదు. పరిహారం కోసం అటవీశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం కనికరించడం లేదు. పులి సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు బాధిత రైతును ఇబ్బందులకు గురిచేయడం విమర్శలకు తావిస్తోంది.

మండలంలోని రొయ్యలపల్లి అటవీప్రాంతంలో పులి సంచరిస్తున్న విషయం ఎద్దును చంపితినడంతో బయటపడింది. రొయ్యలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్ అనే నిరుపేద రైతు ఎద్దు 2022లో అడవికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో గాలింపు చేపట్టగా అధికారులు అటవీప్రాంతంలో పులిదాడిలో మరణించిందని గుర్తించి ఆ రైతుకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లి చూడగా మరణించిన ఎద్దు తనదేనని నిర్ధారించుకున్నాడు. కోటపల్లి రేంజర్ రవి ఆదేశాల మేరకు పశువైద్యాధికారి పవన్‌కుమార్ పోస్టుమార్టం చేసి నివేదికను అందజేశారు. బాధిత రైతు పరిహారం కోసం దరఖాస్తు చేసుకొని రెండు సంవత్సరాలుగా కోటపల్లి ఫారెస్టు కార్యాలయం చుట్టూ, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, పరిహారం అందించడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పరిహారం ఇవ్వడంలో జాప్యంపై అధికారులను ప్రశ్నిస్తున్నాడు. జిల్లాలో ఈ డివిజన్ ప్రక్రియ అంతా సజావుగానే సాగుతుండగా, చెన్నూర్ డివిజన్‌లో మాత్రం జాప్యం ఎందుకవుతుందో తెలియడంలేదని పులిదాడిలో నష్టం జరిగిన బాధితులకు త్వరగా పరిహారం అందిస్తే పులి సంరక్షణలో ప్రజలను కూడా అధికారులు భాగస్వాములు చేసినవారవుతారు.

త్వరలోనే పరిశీలిస్తాం..

పులిదాడిలో మృతిచెందిన పశువు యజమానికి పరిహారం ఫైలును పరిశీలిస్తాం. పశువు పులి దాడిలో మృతిచెందినట్లు అటవీ, పశువైద్యాధికారులు నిర్ధారించారు. త్వరలోనే పరిహారం అందేలా చూస్తాం.

- రవి, ఫారెస్టు రేంజర్, కోటపల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి



వేముల కృష్ణ

కాసిపేట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు మంచిర్యాల అసెంబ్లీ కో ఆర్డినేటర్ వేముల కృష్ణ తెలిపారు. సోమగూడంలో గురువారం మాట్లాడారు. తనపై నమ్మకంతో మంచిర్యాల అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా నియామకానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నాయకత్వంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్లు తెలిపారు. కాసిపేట మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న తనపై నమ్మకంతో నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఎంపిక కావడంతో అధిష్టానికి కృతజ్ఞతలు తెలిపారు.

కూచిపూడిలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నర్మదగౌడ్

జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన గాజుల నర్మదగౌడ్ గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ అందుకున్నారు. యూనివర్సల్ థియలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలకు డాక్టరేట్ ప్రదానం చేయగా, కూచిపూడి నృత్యంలో పీజీ పూర్తి చేసిన నర్మదగౌడ్‌కు యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: అడవిలో అగ్ని ప్రమాదం సంభవిస్తే దానిని ఎలా నివారించాలనే అంశంపై ఉపాధి హామీ కూలీలకు డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ సంతోశ్ అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలు నిర్వహించే పనుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. అడవిలో అగ్ని ప్రమాదం సంభవిస్తే జంతువులకు, మొక్కలకు, అక్కడి జీవ జాతికి ప్రమాదం జరుగుతుందని వివరించారు. అగ్ని ప్రమాదాన్ని నివారించి అడవిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు.

బాబు జగ్జీవన్‌రామ్ జయంతి



వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి మాట్లాడారు. చిన్న వయసులోనే రాజకీయ రంగంలో ఎదిగి సమాజంలో ఉన్న అంటరానితనాన్ని దూరం చేసేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే.శివలీల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం ఆఫీసర్ వి.స్వప్న, యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.జ్యోతి, సిబ్బంది టి.రమాదేవి, వి.దివ్య, కే.అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: మండల కేంద్రంలోని మసీద్‌లో గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. వారితో పాటు ప్రార్థన చేశారు. అనంతరం పండ్లు అందజేసి ఉపవాసం విరమింపజేశారు. ఈ సందర్భంగా మసీద్ పెద్దలు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, పీఏసీఎస్ చైర్మన్ రవి, ఎంపీటీసీ రియాజోద్దీన్, సీనియర్ నాయకులు సయ్యద్ ఇషాక్, ఫసీఉల్లా, సుధాకర్ నాయక్, లక్ష్మీనారాయణ, కరుణాకర్, లక్ష్మి, శాకీర్, ముజ్జు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపన మహోత్సవాలు



పూజలు చేస్తున్న వేదపండితులు



కొలువుదీరిన గోవిందరాజస్వామి విగ్రహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా గల గోవింద క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గోవిందరాజస్వామి సహిత భూవరాహస్వామి ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నాలుగో రోజుతో ముగిశాయి. త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామి పర్యవేక్షణలో శ్రీనివాసాచార్య బృందం మూడు రోజులుగా గోవిందరాజస్వామి సహిత భూవరాహస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా వేదమంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించగా గురువారం ఉదయం 9.02గంటలకు గోవిందరాజస్వామి, భూవరాహస్వామి దేవతా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరిపి అశేష భక్తజనావాహిని మధ్య శాంతికల్యాణం కనుల పండవగా నిర్వహించారు. శాంతి కల్యాణంలో విగ్రహ దాతలు బిల్లా రాజ్యలక్ష్మి–మల్లయ్య దంపతులు, వారి కుమారుడు వికాస్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, మంచిర్యాల పట్టణ, హాజీపూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠా మహోత్సవాలతో పాటు శాంతి కల్యాణం తిలకించారు. గోవింద క్షేత్రం ఆలయ కమిటీ అధ్యక్షుడు, బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా ఆధ్వర్యంలో సభ్యులు, బెటాలియన్ సిబ్బంది ఉత్సవాల ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టగా ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.



శాంతికల్యాణంలో పాల్గొన్న రఘునాథ్, శ్రీనివాస్



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



కొలువుదీరిన భూవరాహ స్వామి విగ్రహం

పాఠశాలలో అసంపూర్తి పనులు



భీమారం: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులకు ఉపయోగపడేందుకు 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో చేపట్టిన వాష్ బేషన్ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో, పనులు అర్ధంతరంగా వదిలిపెట్టాడు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో నీళ్ల బాటిళ్లు వాడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని వెంటనే పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పంట కోసం పాట్లు

జన్నారం: ఎండలు తీవ్రమవడంతో బావుల్లో నీరు అడుగంటిపోయింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. జన్నారం మండలం ధర్మారం గ్రామం రాంటెంకి రాజేశంకు చెందిన మూడెకరాల పొలం అదే గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. బావిలో నీరింకిపోవడంతో అదే గ్రామానికి చెందిన మరో రైతు బావిలో నుంచి ఇంజన్ ద్వారా నీటిని అర కిలోమీటర్ పైపులు పెట్టి నీటిని ఇలా రోడ్డు దాటిస్తున్నాడు. మరో మూడు తడులు పెడితే పంట చేతికస్తుందని, అందుకే ఈ తిప్పలు పడుతున్నానని రైతు పోచయ్య వాపోయారు.